
ఉమ్మడి జిల్లాలో అంబేద్కర్ వర్ధంతి



2



2

నగరంలో గంజాయి పట్టివేత



AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


## బాల్య వివాహాలను నిరోధించడం మతపెద్దల బాధ్యత

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** బాల్యవివాహాలను నిరోధించడం మతపెద్దల బాధ్యత అని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని మహిళా శిశు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గంగాస్థాన్ ఫేస్2లో ఉన్న రామకృష్ణ మఠంలో శనివారం బాల్య వివాహాల విముక్తి గురించి మతపెద్దలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉమెన్ కమిషనర్ మెంబర్ సూదం లక్ష్మి, జిల్లా సంక్షేమాధికారిణి ఎస్.కే.రసూల్ బీ, మైనార్టీ వెల్ఫేర్ జిల్లా అధికారిణి కృష్ణవేణి, డీసీపీవో చైతన్య, శిక్షకులు సునీత, స్వప్న, ఆదిత్య, మత పెద్దలు పాల్గొన్నారు.





## పోలింగ్ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్

**అక్షరటుడే, బోధన్:** గ్రామ పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకుని నవీపేట్ మండలం అభంగపట్నం, ఎడపల్లి మండలం జానకంపేటలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తనిఖీ చేశారు. పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఓటర్ల సంఖ్య, సర్పంచ్, వార్డు స్థానాలకు పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ ప్రక్రియకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ స్టేషన్లలో అందుబాటులో ఉన్న సదుపాయాలను కలెక్టర్ పరిశీలించారు. ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా ప్రతి పోలింగ్ స్టేషన్లలో మౌలిక వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. పోలింగ్ ముగిసిన తర్వాత జాగ్రత్తగా ఓట్ల లెక్కింపు జరిపి ఫలితాలను ప్రకటించాలని సూచించారు. కోరంను సరిచూసుకుని ఉప సర్పంచ్ ఎన్నిక ప్రక్రియను నిర్వహించాలన్నారు. నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని, ఎన్నికల నియమావళి పక్కాగా అమలు జరిగేలా పర్యవేక్షణ చేయాలని చెప్పారు.

### రేషన్‌షాపు తనిఖీ

ఎడపల్లి మండలం నెహ్రూ నగర్‌లోని రేషన్ దుకాణాన్ని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తనిఖీ చేశారు. లబ్దిదారులకు సన్న బియ్యం సజావుగా పంపిణీ చేస్తున్నారా లేదా అని పరిశీలించారు. రేషన్‌కార్డులు కలిగిన కుటుంబాల్లోని సభ్యుల సంఖ్యకు అనుగుణంగా బియ్యం నిల్వలు కేటాయించబడ్డాయా అని ఆరా తీశారు. ఆయన వెంట స్థానిక అధికారులు ఉన్నారు.



## రెండేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అంతా అవినీతే..

**అక్షరటుడే, ఇందూరు:** రెండేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అవినీతి.. అమలు కాని హామీలే ఉన్నాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి విమర్శించారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి అవినీతిమయంగా తయారైందన్నారు. అభివృద్ధి కనిపించడం లేదని మోసాలు, నిర్లక్ష్యం పెరిగిపోయిందని విమర్శించారు. బోధన్ షుగర్ ఫ్యాక్టరీకి ఎటువంటి పునరుద్ధరణ చర్యలు చేపట్టలేదని.. సారంగాపూర్ ఫ్యాక్టరీ పూర్తిగా పాడైపోయినా ప్రభుత్వం పట్టించుకోవట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ యూనివర్సిటీకి ఒక్క పైసా కూడా నిధులు కేటాయించలేదని దుయ్యబట్టారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనకర్ లక్ష్మీనారాయణ, నాగోల్ల లక్ష్మీ నారాయణ, నాయకులు శివాజీ, ప్రమోద్, మాస్టర్ శంకర్, జ్యోతి, తారక్ వేణు, ఇప్పకాయల కిషోర్, గడ్డం రాజు, మల్లేష్ గుప్తా, పంచారెడ్డి శ్రీధర్, బూరుగుల వినోద్, యాదల నరేష్, అమందు విజయ్ కృష్ణ, శ్రీధర్, భూపతి, హరీష్ పాల్గొన్నారు.



# పల్లెల్లో ప్రచారహోరు

- గ్రామాల్లో జోరందుకున్న ప్రచారం
- ఓటర్లను ప్రసన్నం చేసుకుంటున్న అభ్యర్థులు
- ఇప్పటికే కొన్ని గ్రామాల్లో ఏకగ్రీవం

పంచాయతీ ఎన్నికల నామినేషన్ల పర్వం ముగిసింది. మూడు విడతల్లో ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. మూడో విడత నామినేషన్ల స్వీకరణ శుక్రవారంతో ముగిసింది. దీంతో అభ్యర్థులు ప్రచారంలో బిజీగా మారారు. ఓటర్లను ప్రసన్నం చేసుకుంటున్నారు. పలు గ్రామాల్లో పోటీ తీవ్రంగా ఉండడంతో అభ్యర్థులు హామీల వర్షం కురిపిస్తున్నారు. కొన్ని పంచాయతీల్లో ఇప్పటికే సర్పంచులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధికారులు సైతం ఎన్నికలకు సంబంధించి పూర్తి ఏర్పాట్లు చేశారు.

–అక్షరటుడే, ఇందూరు

ఉమ్మడి జిల్లాలో మొత్తం 1,077 గ్రామ పంచాయతీలకు, 9,678 వార్డు స్థానాలకు మూడు విడతల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకోసం నిజామాబాద్ జిల్లాలో 5,053, కామారెడ్డిలో 4,670 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ నెల 11, 14, 17 వ తేదీల్లో జరిగే ఎన్నికలకు నామినేషన్ల పర్వం ముగిసింది. శుక్రవారం మూడో విడతకు సంబంధించి నామినేషన్లు స్వీకరణ పూర్తయింది. అయితే ఉపసంహరణ తర్వాత ఎంతమంది బరిలో నిలిచారో తేలనుంది. ఇప్పటికే నిజామాబాద్ జిల్లా లోని మొదటి దశలో సర్పంచ్ స్థానాలకు 863, వార్డు స్థానాలకు 1,167 మంది, రెండో దశకు సర్పంచ్ స్థానాలకు 774, వార్డు స్థానాలకు 3,535 మంది బరిలో నిలబడ్డారు.

### మొదలైన ప్రచారం..

మొదటి విడతలో బోధన్, కామారెడ్డి డివిజన్‌లో ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించి ప్రచారం ఇప్పటికే మొదలైంది. రెండో విడతకు సంబంధించిన ప్రచారం సైతం శుక్రవారం నుంచే ప్రారంభమైంది. దీంతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. ప్రత్యేక మెనిఫెస్టోలు, గ్రామ అభివృద్ధి యువతను ఆకర్షించే హామీలతో పోటాపోటీగా అభ్యర్థులు ముందుకు వెళ్తున్నారు. ప్రచారంతోపాటు తమ అనుచరులు, కుల సంఘాలకు, ఊరి పెద్దమనుషుల కోసం ఖర్చు పెడుతున్నారు.

### పలుచోట్ల ఏకగ్రీవం

ఉమ్మడి జిల్లాలోని పలు గ్రామపంచాయతీలో ఏకగ్రీవాలపై దృష్టి సారించారు. కొన్ని గ్రామాల్లో వీడీసీలు పెత్తనం చెలాయించగా.. మరికొన్ని గ్రామాల్లో అభ్యర్థుల హామీలతో ఏకగ్రీవం కానున్నాయి. బోధన్ డివిజన్‌లోని 27 గ్రామాల్లో ఏకగ్రీవంగా సర్పంచులను ఎన్నుకున్నారు. ఏకగ్రీవం కోసం పలువురు అభ్యర్థులు రూ.లక్షల్లో ఖర్చులు పెట్టడానికి సైతం వెనుకాడడం లేదు. కామారెడ్డి డివిజన్‌లో పది గ్రామాల్లో సర్పంచులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీబీపేట మండలంలోని శివారు రాంరెడ్డి పల్లి, మాచారెడ్డి మండలం అంకిరెడ్డి పల్లి తండా, బొడుగుట్టతండా, వెనుక తండా, ఎల్లంపేట, పాల్వంచ మండలం భవానిపేట తండా, రాజంపేట మండలంలో గుడి తండా, షేర్ శంకర్ తండా, సదాశివనగర్ మండలం తుక్కోజీవాడి, సజ్జానాయక్ తండాలు ఏకగ్రీవమైనట్లు అధికారులు ప్రకటించారు. లింగంపేటలో 14 పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి.

## రైల్వే స్టేషన్ అభివృద్ధికి సహకరించాలి: ఎమ్మెల్యే



**అక్షరటుడే, కామారెడ్డి :** కామారెడ్డి రైల్వేస్టేషన్ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి అన్నారు. ఆయన రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ.. అమృత్ స్కీం కింద ప్రధాని మోదీ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులకు నిధులు మంజూరు చేశారని.. పనులు కొనసాగుతున్నాయన్నారు. అభివృద్ధి విషయంలో ప్రజలు సహకరిస్తే వందేళ్ల భవిష్యత్తు కనిపిస్తుందని తెలిపారు. రైల్వే స్టేషన్ గోడను ఆనుకుని ఉన్న మడిగెలు తొలగిస్తే ఇందిరాగాంధీ చౌరస్తా వద్ద ట్రాఫిక్ సమస్య తగ్గుతుందన్నారు. స్టేషన్ రోడ్డు మధ్యలో రైల్వే స్టేషన్‌లోకి ఎంట్రన్స్ ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖ మంత్రిని కోరారు. మడిగెలలో వీధి విక్రయాలు చేస్తున్న వారు తన వద్దకు వచ్చినప్పుడు కూడా షాపులు తొలగించాలని చెప్పినట్టు గుర్తు చేశారు. షాపులను ఖాళీ చేసి రైల్వేకు అప్పగించాలన్నారు. పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద ఉన్న మున్సిపల్ స్థలంలో 41 మడిగెలు, గంజ్ స్కూల్ వద్ద ఉన్న మున్సిపల్ స్థలంలో 75 మడిగెల నిర్మాణం జరుగుతుందన్నారు. అందులోకి వీధి విక్రయదారులను తరలిస్తామన్నారు. ఆదివారం రోజు రోడ్డుపై నిర్వహిస్తున్న కూరగాయల మార్కెట్‌ను సర్వే నంబర్ 6లోకి మారుస్తామని చెప్పారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే రైతులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.



## ఎన్నికల్లో శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు

**అక్షరటుడే, బీర్కూరు:** ఎన్నికల్లో శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠినచర్యలు తప్పవని డీఎస్పీ విఠల్ రెడ్డి అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో బీర్కూరు మండలం బైరాపూర్ గ్రామాన్ని డీఎస్పీ విఠల్ రెడ్డి, సీఐ తిరుపతయ్య, ఎస్సై మహేందర్‌తో కలిసి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పూర్తిస్థాయి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎన్నికల ఏర్పాట్లపై ఆరా తీశారు. గ్రామంలో శాంతిభద్రతల పర్యవేక్షణ కొనసాగుతుందని, ప్రజలు నిర్భయంతరంగా ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు.

## భార్య కాపురానికి రావట్లేదని సెల్‌టవర్ ఎక్కిన భర్త



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** భార్య కాపురానికి రావడం లేదని భర్త సెల్‌టవర్ ఎక్కాడు. ఈ ఘటన ఎల్లారెడ్డి పట్టణంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానికంగా నివాసముండే పవన్‌కు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే గొడవల కారణంగా ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. ఆర్నెళ్లుగా భార్య కాపురానికి రాకపోవడంతో మనస్థాపం చెందిన పవన్ పట్టణంలోని సెల్‌టవర్ ఎక్కాడు. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పవన్‌ను బుజ్జగించి సెల్‌టవర్ పైనుంచి కిందికి దింపారు.

## శాంతిభద్రతల పరిరక్షణలో హోంగార్డుల పాత్ర వెలకట్టలేనిది

**అక్షరటుడే, కామారెడ్డి :** శాంతి భద్రతల పరిరక్షణలో హోంగార్డుల పాత్ర వెలకట్టలేనిదని ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. హోంగార్డుల దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో హోంగార్డ్స్ పరేడ్‌ను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ రాజేష్ చంద్ర గౌరవ వందనం స్వీకరించారు. హోంగార్డులు ప్రదర్శించిన పరేడ్‌ను తిలకించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. హోంగార్డుల సంక్షేమం కోసం జిల్లా పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. దేశ భద్రత, శాంతిభద్రతలు, అత్యవసర పరిస్థితుల్లో వారు అందిస్తున్న సేవలు అత్యంత విలువైనవని పేర్కొన్నారు. 1946లో బొంబాయిలో ప్రారంభమై 1962 చైనా దాడుల అనంతరం దేశవ్యాప్తంగా స్వచ్ఛంద దళాలందరినీ ఒకే సంస్థగా ఏకంచేసి బలోపేతం చేసిన హోంగార్డ్స్ వ్యవస్థను ప్రస్తావిస్తూ, జిల్లాలో చేపట్టిన పలు సంక్షేమ చర్యలను వివరించారు. జిల్లా ఏర్పాటు నుంచి మెడికల్ గ్రాంట్లు, కరోనా సమయంలో ప్రత్యేక సహాయం, సహజ, ప్రమాద మరణాలపై ఎక్స్‌గ్రేషియా, ఫ్యూనరల్ ఛార్జీలు, వెల్ఫేర్ గ్రాంట్లు అందించడం వంటి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని ఎస్పీ తెలిపారు. జిల్లాలోని 234 మంది హోంగార్డులకు ఉలెన్ జాకెట్స్ పంపిణీ చేసినట్లు ఎస్పీ తెలిపారు. రోజువారీ విధి భత్యం రూ.921 నుంచి రూ.వెయ్యికి, పరేడ్ అలవెన్స్ రూ.100 నుంచి రూ.200కు పెంచినట్లు వివరించారు. రాష్ట్రంలో మరణించిన 23 మంది హోంగార్డుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.1.15 కోట్లు విడుదల చేసిందన్నారు. కామారెడ్డి జిల్లాలో ఇటీవల మరణించిన హోంగార్డు శ్రీనివాస్ కుటుంబానికి రూ.5లక్షలు త్వరలో అందజేయనున్నట్లు పేర్కొన్నారు. హోంగార్డ్స్ సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్ బ్యాంకులతో ప్రత్యేకంగా రూపొందించిన మెడికల్ ఇన్సూరెన్స్ పథకం ద్వారా రూ.33 లక్షల ఇన్సూరెన్స్ కవరేజ్, రూ.10వేల అవుట్ పేషెంట్ చికిత్స, రెండు ఫుల్ బాడీ చెకప్ ఓచర్లు, కుటుంబ సభ్యులకు వర్తించే వైద్య సదుపాయాలు అందుబాటులోకి తీసుకు వచ్చినట్లు ఎస్పీ తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికల వంటి ముఖ్య సందర్భాల్లో పనిఒత్తిడి ఉన్నప్పటికీ అత్యంత సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తున్నారని అభినందించారు. సాంకేతిక విధులు, సీసీటీఎన్ఎస్, రైటర్స్ పనులు, విపత్తు నిర్వహణ, వరదల్లో రక్షణ చర్యల వంటి పలు బాధ్యతల్లో హోంగార్డులు ముందుండి పనిచేస్తున్నారని తెలిపారు. ప్రతిభ కనబర్చిన హోంగార్డులకు ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నరసింహారెడ్డి, కామారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్పీ చైతన్య రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్, ఆర్ఐలు కృష్ణ, నవీన్, సంతోష్ కుమార్, ఆర్ఎస్సైలు పాల్గొన్నారు.



## ప్రజాసేవలో హోంగార్డులు : సీపీ



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** దేశసేవలో హోంగార్డులు నిరంతరం శ్రమిస్తున్నారని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య పేర్కొన్నారు. హోంగార్డ్స్ రైసింగ్ డేను శనివారం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీ సాయిచైతన్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా హోం గార్డ్స్ నుంచి గౌరవవందనం స్వీకరించి, పరేడ్ కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 1946 డిసెంబర్ 6న ముంబైలో హోం గార్డ్స్ సంస్థను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. హోం గార్డ్స్ అంటే కేవలం ఒక విభాగం కాదు అది సమాజ సేవకు, శాంతి భద్రతలకు ఒక దృఢమైన మద్దతు అని సీపీ పేర్కొన్నారు. మన దేశ సరిహద్దులలో సైన్యంతో పాటు.. రాష్ట్రాల్లో విపత్తు నిర్వహణ సంస్థలతో పనిచేస్తున్న హోంగార్డుల సేవలు వెలకట్టలేనివన్నారు. ఎన్నికల బందోబస్తులు, పండుగల నిర్వహణలో, కోవిడ్ 19 పరిస్థితుల్లో హోంగార్డుల కృషి అనితరసాధ్యమన్నారు. రాత్రి సమయాల్లో గస్తీ నిర్వహణ, అన్ని సందర్భాల్లో ముందుండి ప్రజలను రక్షించడంలో అమోఘమన్నారు. ప్రధానంగా శాంతి భద్రతల విషయంలో, షీటీం ద్వారా ఆకతాయిల ఆటకట్టించేందుకు, కళాబృందం ద్వారా, డ్రగ్స్ అసాంఘిక శక్తులు, మూఢనమ్మకాలను తొలగించేందుకు హోంగార్డులు అహోరాత్రులు కృషిచేస్తున్నారన్నారు. ఆరుగురు హోంగార్డులకు మెడికల్ గ్రాంట్ కింద రూ.పదివేలు చొప్పున ఒక్కొక్కరికి అందజేశారు. కరోనా సమయంలో 131 మందికి రూ. 5 వేలు చొప్పున ఇవ్వడం జరిగిందన్నారు. రోజువారీ భత్యం రూ. 921 నుంచి రూ. 1000కి పెంచబడిందన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్య సౌకర్యం, డబుల్ బెడ్‌రూం హౌసింగ్ స్కీం అందించే ప్రస్తావన కూడా ప్రభుత్వం పరిశీలనలో ఉందన్నారు. వీరి సంక్షేమ చర్యల్లో భాగంగా హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్ బ్యాంక్ వారి ఆధ్వర్యంలో వైద్య బీమా సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. విధి నిర్వహణలో అత్యుత్తమ సేవలు అందించిన 20 మంది హోంగార్డులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. వెల్‌నెస్ హాస్పిటల్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన హెల్త్ కార్డ్స్‌ను కూడా సిబ్బంది అందరికి అందజేశారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) బస్వారెడ్డి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ సతీశ్ (హోంగార్డ్స్), శేఖర్ బాబు (ఎంటీవో), శ్రీనివాస్ (అడ్మిన్), తిరుపతి (వెల్ఫేర్), ఆర్ఎస్ఐలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





## మున్సిపల్ అధికారుల తనిఖీలు..

**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని అహ్మదీబజార్‌లో మున్సిపల్ అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. కాలనీలోని బేకరీలను అధికారులు ఉదయాన్నే పరిశీలించారు. అపరిశుభ్రంగా ఉన్న పలు బేకరీలకు జరిమానాలు విధించారు. పదార్థాలు తయారు చేసే ప్రాంతాల్లో పరిశుభ్రత పాటించాలని అధికారులు, నిర్వాహకులకు సూచించారు. పరిశుభ్రత పాటించని పలు బేకరీలకు రూ.5వేలు వరకు జరిమానా విధించారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ సూపర్‌వైజర్ సాజిద్‌అలీ, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహిపాల్, జవాన్లు తదితరులు పాల్గొన్నారు.



## సాయి ఈశ్వర చారి త్యాగస్ఫూర్తితో ముందుకువెళ్తాం..

**అక్షరటుడే, కామారెడ్డి:** బీసీ రిజర్వేషన్ల కోసం సాయి ఈశ్వర చారి చేసిన ప్రాణత్యాగం వృథా పోనివ్వమని జిల్లా స్వర్ణకార సంఘం, బీసీ జేఏసీ ప్రతినిధులు పేర్కొన్నారు. పట్టణంలో ఇరు సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని స్వర్ణకార సంఘం భవనం నుండి నిజాంసాగర్ చౌరస్తా వరకు పెద్ద ఎత్తున ఈ ర్యాలీ కొనసాగింది. అనంతరం నిజాంసాగర్ చౌరస్తా వద్ద మానవహారం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ల ఉద్యమానికి తన ప్రాణాన్నే త్యాగం చేసిన వీరుడు సాయి ఈశ్వర్ చారి అన్నారు. నీల నాగరాజు, కుంబాల లక్ష్మణ్ యాదవ్, చేపూరి వెంకట స్వామి, రాజమౌళి, బ్రహ్మం, శ్రీనివాస్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## సాయి ఈశ్వర చారి బలిదానం వృథా పోదు..

**అక్షరటుడే, ఇందూరు :** బీసీ రిజర్వేషన్ల కోసం అమరుడైన విశ్వకర్మ బీసీ బిడ్డ సాయి ఈశ్వర చారి బలిదానం వృథా పోదని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ పేర్కొన్నారు. సాయి ఈశ్వర చారి మృతికి నిరసనగా నగరంలోని హనుమాన్ జంక్షన్ విగ్రహాల పార్కులో పూలే విగ్రహం వద్ద బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దీక్ష చేపట్టారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దిగివచ్చి షెడ్యూల్ 9లో రిజర్వేషన్లను పొందుపర్చి బీసీలకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు సత్య ప్రకాష్, దర్శనం దేవేందర్, కొయ్యాడ శంకర్, కరిపే రవీందర్, సత్య ప్రకాష్, బగ్గలి అజయ్, శ్రీనివాస్, చంద్రకాంత్,పాల్గొన్నారు.



## భీమ్‌గల్‌లో కోర్టు ఏర్పాటుకు స్థల పరిశీలన

**అక్షరటుడే, భీమ్‌గల్:** పట్టణంలో కోర్టు ఏర్పాటు కోసం ప్రయత్నాలు వేగం పుంజుకున్నాయి. ఈ మేరకు శనివారం పలు భవనాలను జిల్లా జడ్జి భరత లక్ష్మి పరిశీలించారు. పట్టణంలోని ఆర్టీసీ డిపో ఎంపీడీవో కార్యాలయాలను పరిశీలించి ఈ రెండు భవనాలు అనువుగా ఉన్నాయన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు కోర్టు ఏర్పాటు కోసం భవనాలను పరిశీలించామని జిల్లా జడ్జి పేర్కొన్నారు. జడ్జిలు శ్రీదేవి, భవ్యశ్రీ, తహశీల్దార్ షబ్బీర్, ఎంపీడీవో సంతోష్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జక్కుల శ్రీధర్ ఉన్నారు.





అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా పులాంగ్ చౌరస్తాలో నివాళులు అర్పిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్



ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి..



ఆర్మూర్ అంబేడ్కర్ చౌరస్తాలో..




బాన్సువాడ పట్టణ కేంద్రంలో..

# ఉమ్మడి జిల్లాలో అంబేడ్కర్ వర్ధంతి

**అక్షరటుడే, నెట్‌వర్క్:** భారత రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ అంబేడ్కర్ వర్ధంతి ఉమ్మడి జిల్లాలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ.. అంబేడ్కర్ సేవలను కొనియాడారు. అంటరానితనం రూపుమాపడానికి అంబేడ్కర్ పోరాటం చేశారన్నారు. ఆయన కృషితోనే నేడు అందరికి రిజర్వేషన్లు వచ్చాయన్నారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు ముందుకు సాగాలని సూచించారు. నేటి యువత ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి అంబేడ్కర్‌కు నివాళులు అర్పించారు. దేశానికి అంబేడ్కర్ చేసిన సేవలు మరువలేనివన్నారు.



భీమ్‌గల్ పట్టణంలో ..



ఆలూర్‌లో..



ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి



ఆర్మూర్ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో...



ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో...



ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో..



ఆర్మూర్ సీపీఎం ఆధ్వర్యంలో...



పోతంగల్ మండల కేంద్రంలో..




ఎల్లారెడ్డి పట్టణంలో..



## అయ్యప్ప స్వామి సేవలో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** బిచ్కుంద మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు హాజరై పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందించారు. అయ్యప్ప స్వామి ఆశీస్సులతో మన ప్రాంతం మరింతగా అభివృద్ధి చెందాలని కోరుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, స్వాములు పాల్గొన్నారు.

## సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం



**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** మండల కేంద్రంలోని జంబి హనుమాన్ ఆలయంలో శనివారం భక్తులు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతివారం తప్పనిసరిగా పారాయణం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో దొంతుల రమణయ్య, ఉట్నూర్ రాజశేఖర్, భోగ రామస్వామి, డిష్ నరేందర్, శంకర్, అజయ్, రవీందర్, భూపతి, లక్ష్మణ్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శంగా నిలిచిన లింగంపేట.. 14 జీపీలు ఏకగ్రీవం..

**అక్షర టుడే, లింగంపేట:** స్థానిక సంస్థ ఎన్నికల్లో లింగంపేట మండలం ఆదర్శంగా నిలిచింది. రెండో విడత నామినేషన్లలో పక్రియ ముగియగా.. మండలంలో 41 పంచాయతీల్లో 14 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. మండలంలోని రాంపల్లి, రాంపల్లి తండా, మెంగారం, ముంబాజిపేట్ తండా, బానాపూర్ తండా, బానాపూర్, నల్లమడుగు పెద్ద తండా, లింగంపల్లి కుర్దు, ఎల్లారం, మాలోత్ తండా, మాలోత్ సంగ్యా నాయక్ తండా, అయ్యపల్లి తండా, సజ్జన్ పల్లి, ఒంటర్‌పల్లి ఏకగ్రీవమయ్యాయి.

### గాంధారిలో రెండు జీపీలు..

**అక్షరటుడే, గాంధారి:** మండలంలోని రెండు జీపీలు ఏకగ్రీవమయ్యాయి. లొంక తండా సర్పంచ్‌గా సురేందర్, ఉప సర్పంచ్‌గా అశ్విని బాల్‌సింగ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే మాతృ సంగెం పంచాయతీ సర్పంచ్‌గా వందన బల్వంత్ రావ్‌ను, ఉప సర్పంచ్‌గా సాకలి స్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



## పెళ్లి చేసుకుంటే పది వేల నజరానా.. సర్పంచ్ అభ్యర్థి ప్రచారం

**అక్షరటుడే, బోధన్ :** బోధన్ మండలం మీనార్ పల్లి లో సర్పంచ్ అభ్యర్థి బొబ్బ కవిత వినూత్నంగా ప్రచారం చేస్తున్నారు. తనను గెలిపించినట్లయితే గ్రామంలో జరిగే ప్రతి పెళ్లికి రూ.10వేల కానుకగా ఇస్తానని ఆమె హామీ చ్చారు. ఉన్నత చదువులు చదువుకున్న తనను గెలిపిస్తే.. గ్రామాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వ పథకాలను అర్హులకు అందించడంతో పాటు గ్రామానికి నిధులు తీసుకొచ్చేవిధంగా కృషి చేస్తానని.. గ్రామాన్ని మరింత బాగు చేసుకుందామని ఆమె ప్రచారంలో పేర్కొంటున్నారు.

## అబార్షన్ ఘటనపై పోలీసుల విచారణ.. పోక్సో కేసు నమోదు

**అక్షరటుడే, కామారెడ్డి:** తాడ్వాయి మండలంలోని ఓ గ్రామంలో పెళ్లి కాని యువతి గర్భం దాల్చగా అబార్షన్ చేసిన ఘటన 'అక్షరటుడే' కథనంతో వెలుగులోకి వచ్చింది. దీనిపై వైద్యాధికారులు విచారణ జరుపుతున్నారు. ఈ ఘటన 'అక్షరటుడే' ద్వారా వెలుగులోకి వచ్చాక పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. తాజాగా అబార్షన్ ఘటనపై ఎల్లారెడ్డి డీఎస్పీ విచారణ చేస్తున్నట్టుగా తెలుస్తోంది. అబార్షన్ ఎక్కడ చేశారు.. ఎవరు చేశారని ఆరా తీస్తున్నట్లుగా సమాచారం. అయితే యువతికి అబార్షన్ చేసిన ఆస్పత్రిపై సస్పెన్స్ కొనసాగుతోంది. ఓ ప్రైవేట్ వైద్యుడు రూ.70 వేలకు ఒప్పందం కుదుర్చుకుని అబార్షన్ చేసినట్లు విచారణలో తేలినట్లుగా తెలుస్తోంది. అయితే ఆ వైద్యుడు ఎవరు.. ఆ ఆస్పత్రి ఏది అనేది బాధిత కుటుంబీకులు విచారణకు వెళ్లిన వైద్యాధికారులకు చెప్పడం లేదని తెలుస్తోంది.
సదరు ఆస్పత్రి వైద్యుడే పేరు బయటకు రాకుండా బాధితులను వేడుకున్నట్లుగా సమాచారం. దాంతో బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఆస్పత్రి, వైద్యుడి పేరు చెప్పడం లేదని తెలుస్తోంది. అయితే అబార్షన్ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేస్తున్నారు. విచారణలో పోలీసులు ఆస్పత్రి పేరు తెలుసుకుంటారా.. లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు అబార్షన్ ఘటన వెలుగులోకి రావడంతో వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. వైద్యవృత్తికి మచ్చతెచ్చేలా కొందరు గైనకాలజిస్ట్‌లు నిబంధనలకు విరుద్ధంగా అబార్షన్లు చేస్తున్నట్లుగా గుర్తించారు. జిల్లాలో 23 మంది గైనకాలజిస్ట్‌లు ఉన్నారని, అత్యవసర సమయంలో ఇలా అబార్షన్లు చేసేందుకు ఇద్దరు, ముగ్గురు గైనకాలజిస్ట్‌లు అనుమతి తీసుకున్నట్లుగా తెలుస్తోంది. ఈ క్రమంలో అబార్షన్ ఘటనలపై గైనకాలజిస్ట్‌లతో డీఎంహెచ్‌వో సమావేశం ఏర్పాటు చేసినట్లుగా తెలుస్తోంది. రేపో, ఎల్లుండో సమావేశమై గైనకాలజిస్ట్‌లకు స్పష్టమైన నిబంధనలు వెల్లడించనున్నట్టుగా సమాచారం.

## నగరంలో గంజాయి పట్టివేత



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** నగరంలో గుట్టుగా గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మూడవ టౌన్ ఎస్సై హరిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఖానాపూర్ చౌరస్తా వద్ద బీహార్ కు చెందిన రాంనాథ్ మెహతా అనే వ్యక్తి గంజాయి అమ్ముతున్నాడనే పక్కా సమాచారంతో పోలీసులు దాడి చేశారు. ఈ మేరకు అతడిని అదుపులోకి తీసుకుని తనిఖీలు చేయగా.. 250గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం గంజాయి కొనేందుకు అక్కడికి వచ్చిన ఏడుగురిని సైతం అదపులోకి తీసుకున్నారు. వారిని టెస్ట్ చేయగా పాజిటివ్‌గా వచ్చింది. దీంతో వారిందరిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.